# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 27 ఏప్రిల్, 2026 | పేజీలు :06


## మెట్‌పల్లి సిఐగా సురేష్ బాబు బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా సురేష్‌బాబు ఆదివారం రోజున బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి ఎస్‌ఐలు పబ్బ కిరణ్ కుమార్, ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ నవీన్ కుమార్, మల్లాపూర్ ఎస్‌ఐ అనిల్, పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# డంపుయార్డు సమస్యపై బండికి బాధ్యత లేదా?

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** బిజెపి, బిఆర్ఎస్ రెండు పార్టీలు కరీంనగర్‌లో ఎల్లప్పుడూ సహకరించుకుంటాయని , అది నిన్నటి మున్సిపల్ కార్పోరేషన్ కో ఆప్షన్ ఎన్నికతో మరోసారి రుజువయ్యిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌజ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డంపు యార్డు సమస్యపై కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. సంవత్సరం క్రితం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను తీసుకువచ్చి డంపు యార్డు , ఇతర సమస్యలకు సర్వ రోగ నివారిణిని తీసుకువచ్చానని హడావుడి చేసి స్మార్ట్ సిటీ పనులకు అట్టహాసంగా ప్రారంభోత్సవాలు చేసి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అన్ని పనులు జరిగిపోయినట్టు ప్రజలు భ్రమలు కల్పించారన్నారు. ఇప్పుడేమో బాధ్యత లేనట్లు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నాయకుల ఇళ్ల ముందు జంతువుల కళేబరాలు వేస్తామని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అందరి క్షేమం కోరుకునేవారని, డంపు యార్డు విషయంలోనూ బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ఒక్కటై హుజురుబాద్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా అనవసరంగా రకరకాల విన్యాసాలు ప్రదర్శిస్తున్నాయడని విమర్శించారు. ఇప్పటికైనా బండి సంజయ్ ప్రజలను తప్పుదోవ పట్టించడం మాని కేంద్రం ద్వారా ఏ విధమైన సహకారం లభిస్తుందో చూడాలని, రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎండి తాజ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కార్పోరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, నాయకులు దండి రవీందర్, ఇట్టెపు వేణు, మ్యాకల నర్సయ్య, జీడి రమేష్, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, హనీఫ్, ఉప్పరి అజయ్, ఖలీల్ పాల్గొన్నారు.



## తుమ్మెనాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తుమ్మెనాల గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం ధర్మపురి ఏఎంసి చైర్ పర్సన్ లావణ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని అన్నారు.రైతు పండించిన వరిధాన్యాన్ని కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోళ్లు చేస్తున్నదని పేర్కొన్నారు. ధాన్యంతో వచ్చే రైతులకు మార్కెట్ యార్డులో అన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.దళారుల మాయమాటలకు లొంగకుండా కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయించాలని తద్వారా ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర ఏ గ్రేడ్ వడ్లకు రూ.2389,బి గ్రేడ్ కు రూ.2369 పొందాల్సిందిగా లావణ్య సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సంగ నర్సింహులు,గ్రామ సర్పంచ్ తౌటు జగదీష్,ఉప సర్పంచ్ మల్లేష్,మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆకుబత్తిని తిరుపతి,ముత్తినేని మల్లేష్,కేంద్ర నిర్వాహకులు,రైతులు పాల్గొన్నారు.

## జనగణనలో స్వీయ గణన ప్రారంభం

### కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్:** జనగణన2027లో భాగంగా ఆదివారం స్వీయ గణన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో జనగణన అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనగణనను రెండు విడతలుగా చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి విడతలో మే 11 నుండి జూన్ 9 వరకు ఇళ్ల గణన, రెండో విడతలో జనగణన జరుగుతుందన్నారు. ఈ నెల 26 నుండి మే 10 వరకు ఆన్‌లైన్ ద్వారా ప్రజలు స్వీయ గణన చేసుకోవచ్చని సూచించారు. ఇందుకోసం https://sc.census.gov.in వెబ్ సైట్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని, ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ వాడాలని సూచించారు. వివరాలు సమర్పించిన తర్వాత వచ్చే 11 అంకెల ఐడీ సంఖ్యను భద్రపరుచుకోవాలని, మే 11 నుండి ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ఈ నంబర్ అందించాలని కలెక్టర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు జనాభా ప్రాతిపదికన జరుగుతుందని, కాబట్టి ప్రజలు వాస్తవ సమాచారాన్ని అందించి సహకరించాలని కోరారు. డిజిటల్ సాంకేతికతతో నాణ్యమైన జాబితా రూపొందించేందుకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



# తాళం వేసిన ఇంట్లో చోరీ

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు.ఎస్సై గురుక మహేష్ కథనం ప్రకారం పట్టణానికి చెందిన రాపర్తి ప్రభాకర్ ఇంటికి తాళంవేసి ఈనెల 24న హైదరాబాద్ లోని బందువుల ఇంటికి వెళ్ళాడు.తిరిగి ఆదివారం హైదరాబాద్ నుండి ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉండటంతో ఇంట్లో ఉన్న బీరువాను పరిశీలంచగా దానిలో ఉంచిన పావు తులం బంగారు కమ్మలు,15 తులాల వెండిపట్టీలు,2 తులాల చిన్న కడియాలతోపాటు రూ.4500 నగదు దొంగతనం జరిగినట్లుగా గుర్తించాడు.బాధితుడు వెంటనే పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సైమహేష్ మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో యజమానులు ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్తే పక్క ఇంటివారికి సమాచారం ఇచ్చి వెళ్లాలని అదేవిధంగా విలువైన ఆభరణాలు, నగదు ఇంట్లో పెట్టకుండా బ్యాంకుల్లో దాచుకోవాలని లేదా వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎక్కువ రోజులు దూరప్రయాణాలకు వెళ్తే స్థానిక పోలీస్ స్టేషన్లో సమా



చారం ఇచ్చి వెళ్లాలని తెలిపారు.వీలైనంత వరకు ప్రతీ ఒక్కరూ తమ ఇల్లు పరిసరాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై మహేష్ సూచించారు.

## సిసిరోడ్డు పనులు ప్రారంభించిన చైర్ పర్సన్



**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురి పురపాలక సంఘ పరిధిలోని 6వ వార్డు శ్రీ లక్ష్మీ నరసింహా కాలనీలో తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో మంజూరైన నిధులతో నగరాభివృద్ధి పనులలో భాగంగా సీసీ రోడ్డు డ్రైనేజీ పనులను ఆదివారం చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మీ రాజేష్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మామిల్ల శ్రీనివాస్ రావు,6వ వార్డు కౌన్సిలర్ ముడుసుల ప్రశాంత్,7వ వార్డు కౌన్సిలర్ వాంకుడొతు విజయ్ బాబు,అన్నందాసు తరుణ్,తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను ఆచరించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో సామాజిక సేవా కార్యకర్తలు గంగాధర మధుసూదన్, శాతల్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బొంకూరు గ్రామ సర్పంచ్ ముల్కాల శిరీష శ్రీనివాస్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ముల్కాల శిరీష శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుకోండి,సంఘటితమవ్వండి, పోరాడండి అనే అంబేద్కర్ సూత్రాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో అన్వయించుకోవాలిని పేర్కొన్నారు.అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని సమానత్వం,స్వేచ్ఛ,సామాజిక న్యాయం అనే విలువలను దేశ ప్రజలకు అందించిన మహానుభావుడు అంబేద్కర్ అని అన్నారు.అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ జీవితాంతం పోరాటం చేశారని బాబా సాహెబ్ చూపిన మార్గంలో పయనించడమే ఆయనకు మనం ఇచ్చే గొప్ప గౌరవం అని అన్నారు.అంబేద్కర్ ,భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లడానికి చేస్తున్న ఈ ప్రయత్నం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులుఎరవేణి రాహుల్, జేరిపోతుల నరేష్, పొన్నగంటి రాజరత్నం, తుడుం లింగయ్య,మేకల ప్రేమానందం,బోండ్ల నవీన్, కొండ కొమరవెల్లి,సిరికొండ శ్రీకాంత్,స్థానిక నాయకులు,అంబేద్కర్ వాదులు,గ్రామస్తులు ,తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వావసి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి కార్యక్రమాన్ని కరీంనగర్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా వాసవి మాత చిత్రపటానికి కలెక్టర్ చిత్రా మిశ్రా, ఆర్యవైశ్య ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. జిల్లాలో ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు సమాజంలో వివిధ రకాల సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఆర్యవైశ్యులు మహత్తరమైన సేవా కార్యక్రమాలతో పేద కుటుంబాలకు సహాయం చేస్తుండడం అ భినందనీయమన్నారు. రాబోయే రోజుల్లోనూ ఆర్యవైశ్యులకు మరింత అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల ఆధ్వ



ర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమంతో పాటు వైశ్య భవనం వాసి కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని సందర్శిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ ఆరాధ్య దైవం వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని అదికారికంగా నిర్వహిస్తున్నదుందకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. అడిషనల్ కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, ఆర్య వైశ్య సంఘం నాయకులు చిదుర సురేష్, కటకం వెంకటరమణ తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఏఎంసి చైర్మన్

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రైతులు అరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా సంతోష్ అన్నారు.ఆదివారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం పరిధిలోని దమ్మన్నపేట ,ఆత్మకూర్ గ్రామాలలో చందోలి సొసైటీ ఆధ్వర్యంలో లక్ష్మీ పూర్ ,రంగదాముని పల్లి,తిరుమలాపూర్ గ్రామాలలో నంచర్ల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి తో కలిసి ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు మద్దతు ధర లభిస్తుందన్నారు .ధాన్యం విక్రయాల్లో రైతులు నాణ్యత ప్రమాణాలను



పాటించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు దాసరి తిరుపతి గౌడ్,సర్పంచ్ లు ,ముదం గౌతమి జానారెడ్డి,రాజం పోసవ్వ,తిరుపతి,కాసం రాజశేఖర్ ,జెల్లా అఖిల అనిల్ ,కాసా అంజలి గంగాధర్,నంచర్ల సీఈఓ మధు ,సంగేమ్ తిరుపతి,మ్యాదరి రమేష్,నాయకులు, కార్యకర్తలు, రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెలెస్టియల్ ఫీస్టా – 2026 వార్షికోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** విద్యా ర్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సిరిసిల్ల మండల విద్యాధికారి దూస రఘుపతి, కరస్పాండెంట్ రాధాకృష్ణ ప్రసాద్‌లు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ సెలెస్టియల్ హై స్కూల్లో 16వ వార్షికోత్సవాన్ని కరస్పాండెంట్ బుర్ర రాధకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో సెలెస్టియల్ ఫీస్టా2026 పేరుతో ఘనంగా నిర్వహించారు. ఆట పాటలతో విద్యార్థిని విద్యార్థులు నృత్యం చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిరిసిల్ల మండల విద్యాధికారి దూస రఘుపతి, గౌరవ అతిథిగా 38వ వార్డు కౌన్సిలర్ ఆకుల స్వప్న కృష్ణ, మోటివేటర్ కృపాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. హై స్కూల్ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనీ అన్ని ప్రైవేట్ స్కూల్లలో ఒక ప్రత్యేకమైన స్కూల్‌గా సెలెస్టియల్ హై స్కూల్ పేరు గాంచినది అన్నారు. అంకితభావంతో వృత్తినిబద్ధతతో పనిచేసే యాజమాన్యం, ఉపాధ్యాయులు గల పాఠశాల అని అన్నారు. విద్యార్థులు సోషల్ మీడియా జోలికి వెళ్లకుండా మొబైల్ ఫోన్ వాడకుండా చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివితే మంచి ఉత్తీర్ణత సాధించవచ్చు అని అన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుతూ ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యసించి కుటుంబానికి, సమాజానికి, దేశానికి సేవ చేసే వారు భారత పౌరులుగా ఎదగాలన్నారు.

## గంగాధర ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేత ఠాగూర్ కింగ్స్

**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండల కేంద్రంలో నిర్వహించిన గంగాధర ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఎడ్ల అనిల్ అనూష్ ఆద్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో 8 జట్లు పాల్గొన్నాయి. గత పది రోజులుగా జరుగుతున్న టోర్నమెంట్‌లో మొదటి స్థానం ఠాగూర్ కింగ్స్ నగదు బహుమతి రూ.30 వేలు, రెండో స్థానంలో నిలిచిన ఏకెఎం టీమ్ రూ. 20 వేలు, మూడోస్థానంలో విక్రమ్ వైట్ వైర్స్ రూ. 5 వేలు, నాలుగో స్థానంలో శ్రీహరి సోల్జర్స్ రూ. 5 వేల నగదు బహుమతులు అందుకున్నారు. మధురానగర్ సర్పంచ్ వేముల భాస్కర్, ఉపసర్పంచ్ రాజు, వార్డు మెంబర్లు సంజీవ్, చందు, ప్రభాకర్, శ్రీనివాస్, లవన్ కుమార్, శ్రీహరి, బాచి, ప్రవీణ్, సంతు, విజయ్ తదితరులున్నారు.

## కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుతో స్పందించిన అధికారయాంత్రాంగం

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలో ఉన్న ఎచ్‌పి పెట్రోల్ బంక్‌వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో గత ఆదివారం చరవాణిలో సమస్యను రాజన్నసిరిసిల్లా కలెక్టర్ గరీమా అగ్రవాల్‌కు ఓమాజి ప్రజాప్రతినిధి వివరించారు.అధికార యంత్రాంగం ఆర్‌అండ్ బి అధికారులు బీఏఇ అనూజ అద్వర్యంలో బంక్‌వద్ద జీబ్రాలైన్స్ రోడ్డుప్రమాదాలు జరుగకుండా చేశారు.జిల్లా కలెక్టర్ గరీమాఅగ్రవాల్,ఆర్‌అండ్‌బీ అధికారులకు,సిబ్బందికి ఎల్లారెడ్డిపేట గ్రామప్రజలు,మాజీ ప్రతినిధి బాలరాజుయాదవ్ ప్రత్యేకంగా దన్యవాదములు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రలు ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం లోని తుంగూర్ గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆద్వర్యంలో వారి ధాన్యం కొను గోలు కేంద్రాలను అధికారులు మండల నాయకులతో కలిసి ప్రారంబించిన సర్పంచ్ రాజగోపాల్ రావు బీర్‌పూర్ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అద్వర్యయం లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినారు తుంగూర్ సెంటర్ల ను ప్రారంభోత్సవం చేయటం జరిగినది.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శీలం లింగన్న గౌడ్, వార్డు సభ్యులు దోసారపు శ్రీనివాస్, ఇంద్రాల రాజశేఖర్ ,తిరుపతి ,కందేనకుంట సర్పంచ్ కొమిరే నర్సయ్య,సిఈవో తిరుపతి,దేవస్థానం చైర్మన్ ఉయ్యాల కిషన్,నాయకులు, రైతులు సంఘం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సహస్ర కలశాభిషేకం

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న నరసింహ నవరాత్రోత్సవాలలో భాగంగా 5వ రోజు ఆదివారం సహస్ర కలశాభిషేకం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఉదయం పూర్ణాహుతి అనంతరం శ్రీ స్వామివారికి పురుష సూక్త,శ్రీసూక్త, కల్పోక్త,న్యానకపూర్వక షోడశ ఉపచార పూజ,సహస్ర నామార్చన, పంచోపనిషత్తులతో సహస్ర కలశాభిషేకము వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్, దేవస్థానం మాజీ అధ్యక్షులు జక్కు రవీందర్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరేళ్ల శ్రీనివాసచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసచార్యులు, సీహెచ్ రమణయ్య, నంబి నర్సింహమూర్తి, నేరేళ్ల సంతోష్ కుమార్, వొద్దిపర్తి కళ్యాణ్, విజయ్, అరుణ్, వంశీ, సూపరింటెండెంట్ కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**ప్రజాపక్షం/సారంగాపూర్:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం లచ్చక్కపేట గ్రామానికి చెందిన గోపినేని రాజమల్లు లావణ్య తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయి ఆదివారం గృహప్రవేశం సందర్భంగా వారి ఆహ్వానం మేరకు హాజరై ఇందిరమ్మ ఇల్లును జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ ప్రారంభించి, శుభాకాంక్షలు తెలిపారు. చీర కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సలీం, ఎస్సై గీత, లచ్చక్కపేట సర్పంచ్ చెట్ల పల్లి రమ భాస్కర్, నాగునూర్ సర్పంచ్ రుషేంద్ర శంకర్ రెడ్డి, పెంబట్ల సర్పంచ్ రాధ రాజు, నాయకులు రమణారావు, తోడేటి శేఖర్ గౌడ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ నరసింహ రెడ్డి, తిరుపతి, శ్రీధర్, మహేష్, డాక్టర్ రమేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఐడిఒసి పెద్దపల్లిలో వాసవి మాత జయంతి

### కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఐడిఒసి పెద్దపల్లిలో వాసవి మాత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయని కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్ తెలిపారు. ఆదివారం ఐడీఒసి పెద్దపల్లిలో యువజన, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వాసరి మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్ వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్ మాట్లాడుతూ వాసవి మాత బోధనలు సమాజంలో సమానత్వం, సేవా భావం, సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు దోహదం చేస్తాయని తెలిపారు.ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పాటిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు.మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన, పర్యాటక శాఖ అధికారులు, సిబ్బంది, సంఘు ప్రతినిధులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న ప్రభుత్వ విప్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు హైదరాబాద్ హైటెక్స్ లో జరిగిన మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుమారుడు హరిహరన్ సాయి దీక్షల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పీర్జాజిగూడ మాజీ మేయర్ గృహప్రవేశ వేడుకల్లో కసిరెడ్డి అనిల్ రెడ్డి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కసిరెడ్డి అనిల్ రెడ్డి ఆదివారం హైదరాబాదులోని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి క్రాంతి నూతన గృహప్రవేశం వేడుకల్లో పాల్గొని వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పిఏంసి ప్రధాన కార్యదర్శి ఏడవెల్లి రఘువర్ధన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు, పెద్దపెల్లి జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షులు శ్రీ ముస్త్యాల రవీందర్మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుమారుడు హరిహరన్ సాయి వివాహము ఆదివారం హైదరాబాదు హైటెక్స్ లో జరగిన వివాహ వేడుకకు జిహెచ్ఎంసి కమిషనర్ ఐఏఎస్ శ్రీ కర్ణన్ తో కలిసి వధూవరులను ఆశీర్వదించారు.

# ఖమ్మంపల్లి టు భూపాలపల్లి ప్రయాణం ఇక సులభం!

### కిషన్‌రావుపల్లె అటవీ ప్రాంతం మీదుగా పూర్తయిన మట్టి రోడ్డు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా, భూపాలపల్లి జిల్లాల ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి నుండి భూపాలపల్లికి వెళ్లే రహదారి పనులు వేగవంతం కావడంతో ప్రయాణ కష్టాలు తీరనున్నాయి.ముఖ్యంగా భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలంలోని కిషన్‌రావుపల్లె అటవీ ప్రాంతం నుండి భూపాలపల్లి వరకు మట్టి రోడ్డు పనులు పూర్తి కావడంతో రవాణా మార్గం సుగమమైంది. *తగ్గనున్న ప్రయాణ భారం:* గతంలో మంథని పట్టణం నుండి భూపాలపల్లికి వెళ్లాలంటే దాదాపు 60 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు మంథని, ఖమ్మంపల్లి మీదుగా తాడిచర్ల, పెద్దతుండ్ల, కిషన్‌రావుపల్లె అటవీ ప్రాంతం గుండా నేరుగా భూపాలపల్లికి చేరుకోవచ్చు. దీనివల్ల ప్రయాణికులకు సుమారు 20 కిలోమీటర్ల మేర దూరం తగ్గడమే కాకుండా, సమయం కూడా భారీగా ఆదా అవుతుంది. *మంత్రి శ్రీధర్ బాబు కృషితోనే..* రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ రోడ్డు మార్గంపై ప్రత్యేక దృష్టి సారించి, అటవీ శాఖ నుండి అనుమతులు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో మంథని, ముత్తారం, మల్హార్ మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు తమ ఉత్పత్తులను తరలించడానికి, సామాన్య ప్రయాణికులకు ఈ కొత్త దారి ఎంతో మేలు చేకూర్చనుంది. తమ చిరకాల వాంఛను నెరవేర్చిన మంత్రి శ్రీధర్ బాబుకు రెండు జిల్లాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# ఎరువుల కర్మాగారం ఉద్యోగ బాధితులకు దళారుల నుంచి న్యాయం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం ఎరువుల కర్మాగారం (ఆర్ఎఫ్‌సిఎల్)లో ఉద్యోగాలకు ఇస్తామన్న దళారుల విషయంలో బాధితులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరువుల కర్మాగారం ఉద్యోగ బాధితుల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆర్ఎఫ్సీఎల్ బాధితులకు డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. దళారులను జైలు కు పంపించి బాధితులకు డబ్బులు ఇస్తానన్న మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.బాధితుల డబ్బులతో గోదావరి ఒడ్డుకు 18 ఎకరాల భూమి తీసుకుంటే దానికి సంబంధించి లే అవుట్ పర్మిషన్లు కూడా ఎమ్మెల్యే ఇప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు ఇవ్వాల్సిన డబ్బులను పక్కనపెట్టి సిగ్గు లేకుండా పర్మిషన్లు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఉద్యోగాలు వస్తాయని కొందరు బాధితులు భూములు స్థలాలు కుటుంబ సభ్యుల నగలు అమ్మి దళారులకు ముట్టచెప్పారని గుర్తు చేశారు దళారులు ఇంకా ఇవ్వాల్సిన డబ్బులను చెల్లించకపోతే వచ్చే మా ప్రభుత్వం వారికి న్యాయం చేస్తామని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాన్ని, మిమ్మల్ని వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే ఆ 18 ఎకరాలను 100 నాగళ్ళతో దున్నించి బాధితులకు పరిహారం ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. అంతే కాకుండా బాధితులతో డిల్లీ కి వెళ్ళి కేంద్ర పెట్రోలియం శాఖ అధికారులను కలుస్తామన్నారు. కార్యక్రమంలోబీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జహిద్ పాషా,కోఆప్షన్ మెంబర్ తస్లీమా భాను, పోలాడి శ్రీనివాస రావు మాజీ కార్పొరేటర్లు అయిత శివకుమార్, రవి నాయక్, బొబ్బిలి సతీష్, యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, మాజీ కౌన్సిలర్ కృష్ణ స్వామి,నడిపల్లి సాయి, టీజీబీకేఎస్ కార్మిక నాయకులు రొడ్డ సంపత్, సురేందర్, అడ్డగట్ల గోపి, రాజ్ కుమార్,కళాధర్ రెడ్డి, అబ్దుల్ రెహ్మాన్, తెలంగాణ ఉద్యమకారులు పర్ష స్వాతి, రామస్వామి, పోషం, దుర్గా ప్రసాద్, గణేష్, కొమరయ్య, శ్రీధర్, అన్వర్, శ్రీనివాస్, ఉదయ్, నరేష్, ఠాగూర్, రమేష్, నరేష్, ప్రేమ్ కుమార్, మహేందర్, సురేష్, పోయిల రవి, దువాసి కార్తీ క్, నార్మల రమేష్, అంజన్న, షరీఫ్,సుమతి, జయ, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీల నిర్వహణ అభినందనీయం




**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే సంకల్పంతో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.ఆదివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కీర్తిశేషులు అల్లాడి అరవిందరావు స్మారక అర్థం సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఎస్ పి ఎల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వేసవి సమయంలో యువత పెడదోవ పట్టవద్దనే సంకల్పంతో యువతలో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల తరహాలో 8 టీములు వేలం ద్వారా ఎన్నుకోబడి పోటీలలో పాల్గొంటారని అన్నారు. ప్రతి ఒక్క టీం 7 మ్యాచులు ఐపీఎల్ తరహాలో ఆడతయన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు గ్రరెపల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ జూపల్లి సందీప్ రావు ప్రథమ బహుమతి లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతి 50 వేల రూపాయలుతోపాటు ప్రోత్సాహక బహుమతులు అందిస్తూ క్రీడలు కొనసాగడం శుభ పరిణామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్న య్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్ టి రమేష్, మాజి ఎంపీటీసీ సూర శ్యామ్, మనోజ్ గౌడ్, నిర్వాహకులు సంజీవ్, క్రాంతి, అని ల్, సతీష్, సిద్ధా తిరుపతిలతోపాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మ రక్షణకు నడుం బిగిద్దాం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** హిందూ ధర్మ రక్షణకు ప్రతి హిందువు నడుం బిగించాలని శ్రీశ్రీశ్రీ విష్ణుసేవానంద గిరి స్వామీజీ పిలుపునిచ్చారు. ఎలిగేడ్ మండల కేంద్రం లోని స్థానిక మధుర ఫంక్షన్ హాల్ ఆదివారం జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. హిందుత్వము మానవాళి హితం కోరే ధర్మమని, హిందువు మతతత్వవాది కాదని ఆయన చెప్పారు. హిందువుగా హిందూ ధర్మాన్ని, సంస్కృతిని ఆచరించాలని వివరించారు. కుటుంబం నుండి పరివర్తన కొరకు మహిళలు పాటుపడాలని కోరారు. దేవాలయాలను శక్తివంతము చేయాలని అన్నారు. హిందువులు కులాల వారీగా విభజించబడడం హేయమని, హిందువు లు సమైక్యంగా కలిసి జీవించాలని అన్నారు. హిందూ స మ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు రాజారెడ్డి గారు , కోశాధికారి జ నార్ధన్ గారు, సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు..వివి ధ గ్రామాల నుండి హిందూ బంధువులు తరలివచ్చి పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బాలాజీ



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కొలిపాక ప్రవీణ్‌రిషితల వివాహ వేడుకలు సోమవారం మంథని లోని పోచమ్మ వాడలోని మహాలక్ష్మి గార్డెన్లో జరిగిన వివాహ వేడుకలకు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బాలాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను పుష్పగుచ్ఛంతో అభినందించి,వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ వార్డు సభ్యులు ఆకోజు అశోక్ చారి, లక్కం ప్రభాకర్, మూగ రవీందర్ తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

### మండల పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/ముత్తారం :** నేడు సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే,మంథని నియోజకవర్గ ఇంచార్జ్ పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు ముత్తారం మండలంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని టిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. గ్రామాల్లో జెండా ఆవిష్కరణ ఉదయం 08:30 గంటలకు ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు, నాయకుల ఆధ్వర్యంలోమండల కేంద్రంలో కార్యక్రమం ఉదయం 09:00 గంటలకు, అడవి శ్రీరాంపూర్ చౌరస్తాలో నిర్వహించే జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముత్తారం మండల బిఆర్ఎస్ పార్టీ యూత్, మహిళా, బిసి, ఎస్సి, మైనారిటీ, అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కోరారు.

## జనగామలో ఉచిత దంత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రామగుండం మండలం జనగామ గ్రామంలో ఆదివారం శ్రీకాంత్ డెంటల్ హాస్పిటల్ వారు మరియు 6వ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామని రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరం విజయవంతమైంది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ శిబిరానికి వార్డు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులచే పరీక్షలతో పాటుసేవలను పూర్తిగా ఉచితంగా అందించారు.ఎండిఎస్ డాక్టర్ కన్సల్టేషన్ డిజిటల్ ఒపిజి ఎక్స్‌రే (ఎక్స్‌రే)పళ్లు పీకడం (టూత్ ఎక్స్‌ట్రాక్షన్)సిమెంట్ ఫిల్లింగ్ మరియు టీత్ స్కేలింగ్అవసరమైన రోగులకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోకల శ్యామని రమేష్‌తో పాటు స్థానిక నాయకులు మరియు ప్రతినిధులు ప్రశాంత్, బొడ్డు మహేందర్, జువ్వాడి మాధవ్ రావు, అరెళ్ల రవితేజ, జనగామ సంతోష్, సిద్ద తిరుపతి, జనగామ బద్రి, భీమా సాగర్, ముత్యాల రమేష్, అక్కపాక కుమార్, మేకల సంపత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వార్డు ప్రజలు, వృద్ధులు మరియు పిల్లలు ఈ అవకాశాన్ని పెద్ద ఎత్తున వినియోగించుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన శ్రీకాంత్ డెంటల్ హాస్పిటల్ యాజమాన్యానికి మరియు మేనేజ్‌మెంట్ డా సుమలత,ప్రతినిధులు సునీల్,ప్రశాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ : క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా పిలుమల్ల గట్టయ్య, ప్రధాన కార్యదర్శిగా మారపల్లి వేణుగోపాల్ రెడ్డి, కోశాధికారిగా అరేల్లి గోపి కృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గట్టయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటా నని, ఇళ్ల స్థలాలు, భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్లబ్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సభ్యులందరూ సహకరించా లని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకా ంక్షలు తెలిపారు. కార్యవర్గంలో ఈదునూరి సారంగారావు, ఆరంధ స్వామి, వెంగళదాస్ సంతోష్, తాండ్ర సతీష్, కలువల శ్రీనివాస్, గంగారపు గౌతమ్ కుమార్, పిడి రాజేంద్ర ప్రసాద్, కొండ శ్రీనివాస్, బండ అమర్నాథ్ రెడ్డి, పురుషోత్తం గంగులు, నాంపల్లి గట్టయ్య, శ్రీనాథ్, నాసబత్తుల ప్రవీణ్, దాసరి స్వామి, కొమ్ము సదానందం, దుర్గం వెంకట స్వామి, మోరె రవీందర్ ఉన్నారు.

## ఫిన్‌లాండ్ విద్యా విధానంపై ఉపాధ్యాయుల అధ్యయనం

ప్రజాపక్షం / జన్నారం : ఫిన్‌లాండ్ దేశంలో ఐదు రోజుల అంతర్జాతీయ ఉపాధ్యాయుల ఎక్స్‌పోజర్ విజిట్‌ను తెలంగాణ ఉపాధ్యాయులు విజయవంతంగా పూర్తి చేసి ఆదివారం స్వదేశానికి చేరుకున్నారు. హెల్సింకిలోని ప్రముఖ పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాలను సందర్శించి అక్కడి విద్యా విధానాలను వీరు అధ్యయనం చేశారు. ముఖ్యంగా విద్యార్థి కేంద్రీకృత బోధన, తక్కువ హోంవర్క్, ఎక్కువ ప్రాక్టికల్ లెర్నింగ్ పద్ధతులను పరిశీలించారు. ఫిన్‌లాండ్ విద్యా విధానం విద్యార్థుల సృజనాత్మకతకు, నైపుణ్యాభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ పర్యటనలో పొందిన అనుభవాలను రాష్ట్ర విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఉపయోగపడేలా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. పర్యటనలో ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్, దాముక కమలాకర్, జాజాల శ్రీనివాస్, బూక గంగయ్య పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

ప్రజాపక్షం / మందమర్రి : మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో నల్లెల్లి వినీత్, శ్రావంతి దంపతుల నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ రిబ్బన్ కట్ చేసి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం వాస్తు పూజలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు స్థిర నివాసం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## జిల్లాలో ఘనంగా వాసవి మాత జయంతి ఉత్సవాలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం / మంచిర్యాల : శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలను జిల్లాలో ఆదివారం అధికారికంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు కలెక్టర్ కుమార్ దీపక్ సతీసమేతంగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కులదైవమైన వాసవి మాత జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఉదయం కుంకుమ పూజ, సాయంత్రం ఊరేగింపు, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు ఆలయానికి విచ్చేసిన కలెక్టర్ దంపతులకు అధికారులు, ఆర్యవైశ్య ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. అలాగే నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఇతర అధికారులు, ఆర్యవైశ్య ప్రతినిధులు అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు చాతరాజుల దుర్గాప్రసాద్, హనుమంత రెడ్డి, సునీల్, ఆర్యవైశ్య ప్రముఖులు సిరిపురం రాజేశం, కటకం హరీష్, చిలువేరు శ్రీనివాస్, ముక్త శ్రీనివాస్, మాదంశెట్టి సత్యనారాయణ, కొత్త రాజేశం, కేశెట్టి వంశీకృష్ణ, వాసవి క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జెడ్ పి హెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం / మంచిర్యాల : కాలం మారినా జ్ఞాపకాలు చెరిగిపోవని మంచిర్యాల పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు నిరూపించారు. సుమారు 23 ఏళ్ల తర్వాత ఆదివారం మంచిర్యాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో వీరు సందడి చేశారు. ఒకే తరగతి గదిలో చదువుకున్న మిత్రులంతా సుదీర్ఘ కాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల రోజుల్లోని మధుర సంఘటనలను, నాటి గురువులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన వీరు తమ అనుభవాలను పంచుకుంటూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని సంకల్పించారు. భవిష్యత్తులో ఇలాంటి సమావేశాలను తరచుగా నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన దినోత్సవం



ప్రజాపక్షం / జన్నారం : జన్నారం మండల కేంద్రంలో శ్రీ వీర పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 333వ సమాధి ఆరాధన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం తెల్లవారుజామునే ఆలయంలో స్వామి వారికి పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. వేద మంత్రోచ్చారణల నడుమ పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తి శ్రద్ధల మధ్య ఈ ఆరాధన వేడుకలు కొనసాగాయి. కార్యక్రమంలో అఖిల భారత విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్, గౌరవ అధ్యక్షుడు యశోద గురువయ్య, సభ్యులు రామచంద్రం, పూజారి నందయ్య పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలో వీధి దీపాల ఏర్పాటు

ప్రజాపక్షం / పెంచికలపేట్ : మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీలో నూతనంగా వీధి దీపాలు అమర్చారు. గ్రామంలోని పలు వీధుల్లో పనిచేయని లైట్లను సర్పంచ్ భక్తు రాంచందర్ గుర్తించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. ప్రతి వాడను సందర్శిస్తూ సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బన్సపెల్లి లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం / దిలావర్‌పూర్ : మండలంలోని బన్సపల్లి గ్రామంలో పి.ఎ.సి.ఎస్. ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ మల్లేష్ ప్రారంభించారు. ప్రతి ఒక్క రైతు తమ యొక్క పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మాత్రమే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు విక్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్యం, మాజీ సర్పంచ్ విక్రం, సాయినాథ్ కాంగ్రెస్ నాయకులు నరేష్ ప్రభు గౌడవ రైతులు పాల్గొన్నారు.

## జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భవేశ్ మిశ్రా

ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్ గా భవేశ్ మిశ్రా ఆదివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముందుగా జిల్లాకు చేరుకున్న నూతన కలెక్టర్‌కు పూర్వపు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు, బి.వెంకటేష్వర్లు కిషోర్ కుమార్‌లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమం లో ఆర్డీఓ రత్నకళ్యాణి, జిల్లా అధికారులు జీవరత్నం, డా.రాజేందర్, శ్రీనివాస్, నరసింహా రెడ్డి, దయానంద్, భోజన్న, సుధాకర్, విజయలక్ష్మీ రమణ, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



## సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రజాపక్షం / లక్సెట్టిపేట : వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని ప్రభుత్వ పండుగగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆర్యవైశ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని వాసవి మాత ఆలయంలో ఆదివారం ఆర్య వైశ్య సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తొలుత అమ్మవారికి అభిషేకాలు, మహిళలతో కుంకుమ పూజలు జరిపారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. తాసిల్దార్ దిలీప్ కుమార్ హాజరై మాట్లాడుతూ వాసవి జయంతిని ప్రభుత్వ వేడుకగా జరపడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నల్మాస్ కాంతయ్య, కొత్త వెంకటేశ్వర్లు, చెట్ల రమేష్, మైలారపు సుధాకర్, నరేందుల సాహితి, గద్దం వికాస్, నల్మాస్ శ్రీనివాస్, ఒజ్జల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం / పెంచికలపేట్ : పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మాజీ జెడ్‌పిటిసి సరిత, పార్టీ మండల అధ్యక్షుడు రాజన్న పేర్కొన్నారు. మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన పూసాల సాగర్, పద్మ దంపతులు తమ నూతన గృహంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రవేశించారు. లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహ సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వాసవి మాత జయంతి వేడుకలు

ప్రజాపక్షం / జన్నారం : వాసవి మాత జయంతిని పురస్కరించుకొని జన్నారం మండల కేంద్రంలోని హనుమాన్ సహిత లక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుడు గుండి గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జక్కు భూమేష్, వర్తక సంఘం అధ్యక్షుడు వొజ్జల వామన్ కుమార్, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ జక్కు సత్తయ్య, నరేంద్ర గోపాలకృష్ణ, గుండె లచ్చన్న, గుండ సుధాకర్, కొమరవెల్లి రామకృష్ణ, జక్కు రమేష్ పాల్గొన్నారు.



## ఇందూరు లయన్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** లయన్స్ సేవలను మరింత విస్తృతపరుస్తామని నూతన అధ్యక్షులు పెట్టిగాడి రాఘవేందర్ అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు సర్వ సభ్య సమావేశం నగరంలోని సందీప్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా 202627 కు గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షునిగా పెట్టిగాడి రాఘవేందర్, కార్యదర్శిగా చింతల గంగాదాస్, కోశాధికారిగా అంకం రాజేందర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా లయన్స్ జిల్లా అదనపు కోశాధికారి లక్ష్మీ నారాయణ వ్యవహరించారు. లయన్స్ సేవలను మరింత విస్తృత పరుస్తామని నూతన అధ్యక్షునిగా ఎన్నికైన రాఘవేందర్ ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా కార్యదర్శులు డి. యాదగిరి, కె.రవీందర్, జోన్ చైర్మన్ అబ్బాయి లింబాద్రి, రీజియన్ పూర్వ చైర్మన్ బి. గురుప్రసాద్, డైరెక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

## వివాహానికి హాజరైన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలో ఆదివారం ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పలు పెళ్లి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చింరాజ్‌పల్లి బిజెపి నాయకుడు తోట రాజన్న మనుమడి నూతన వస్త్రాలంకరణకు, కొందూరు, బాద్గుణ, కంఠం గ్రామాలలో జరిగిన పెళ్లి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. బిజెపి నాయకులు వివాహ వేడుకలలో పాల్గొన్నారు.

## నందిపేట్ పిహెచ్‌సి సందర్శన

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో గల ఆరోగ్య కేంద్రాన్ని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవిందర్ నాయక్ సందర్శించారు. జిల్లా వైద్యాధికారి రాజా శ్రీ, ఆర్మూర్ డిఎం అండ్ హెచ్‌వో రవిందర్, నందిపేట్ డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, పద్మావతి, సిబ్బంది, నందిపేట్ సర్పంచ్ లింగం పాల్గొన్నారు.

## స్వీయ గణనలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ప్రతి ఒక్కరు జనగణనలో పాల్గొనాలని స్వీయ నమోదు చేసుకోవాలని, ఎటువంటి అపోహలకు గురికాకుండా ప్రభుత్వ అధికారిక పోర్టల్‌లో తమ వివరాలను పొందుపరచాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. జనగణన 2027(సెన్సెస్ ప్రోగ్రాం)లో భాగంగా నిజామాబాద్ మునిసిపల్ అధికారులు జనగణనను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా స్వీయ గణనలో పాల్గొన్నారు. జనగణన పోర్టల్ ద్వారా సంబంధిత అధికారులు స్వీయ నమోదు వివరాలు, ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి అపోహలకు గురికాకుండా ప్రభుత్వ అధికారిక పోర్టల్‌లో తమ వివరాలను పొందుపరచాలన్నారు. ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తారని, అలాగే ప్రజలు కూడా స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.

# ఘనంగా వాసవీ మాత జయంతి వేడుకలు



**ప్రజాపక్షం నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం వాసవి మాత జయంతి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నిర్మల్ పోలీస్.. మీ పోలీస్ అనే నినాదంతో ప్రజలకు చేరువగా ఉండే జిల్లా పోలీసు శాఖ, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏ.ఆర్ హెడ్ క్వార్టర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. నివాళులర్పించిన అధికారులు జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది వాసవి మాత చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాతట్లాడుతూ, వాసవి మాత శాంతి, ధర్మానికి మరియు త్యాగానికి నిలువెత్తు రూపమని కొనియాడారు. సందేశం మరియు ఆదర్శం "వాసవి మాత చూపిన మార్గం సమాజానికి ఎంతో ఆదర్శప్రాయం. ఆమె జీవితం మనకు ధర్మం మరియు న్యాయం కోసం ఎలా నిలబడాలో నేర్పిస్తుంది" అని అధికారులు పేర్కొన్నారు. లోక కళ్యాణం కోసం ఆమె చేసిన త్యాగం వెలకట్టలేనిదని, అహింసా మార్గంలో నడుస్తూ సమాజ హితం కోరడమే ఆమెకు మనం ఇచ్చే నిజమైన గౌరవమని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ వేడుకల్లో జిల్లా పోలీసు విభాగంలోని వివిధ స్థాయిల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**నిర్మల్ టౌన్ :** కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆదివారం వాసవి మాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా ఆయన పలువురు అధికారులు, సంఘాల నాయకులతో కలిసి వాసవి మాతా చిత్రపటానికి పూల మాలలు వేశారు. డి.వై.ఎస్.ఓ. శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, సంఘ నాయకులు, పాల్గొన్నారు.



# ఎడపల్లిలో ఘనంగా వాసవిమాత జయంతి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వైశాఖ శుద్ధ దశమి ఆదివారం వాసవి మాత జయంతి సందర్భంగా ఎడపల్లి ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి సందర్భంగా మాత చిత్రపటానికి పూల మాలలు వేసి అమ్మవారికి నివాళులు అర్పించి, ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వాసవి మాత వృత్యాంతంను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి మండల ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.



# 45ఏళ్ల తరువాత ఒక్కటైన మిత్రులు

### రెంజల్ జడ్పీహెచ్‌ఎస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** 45ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తరువాత, చిన్ననాటి మిత్రుల కలయికతో నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రం సందడిగా మారింది. 198081 విద్యా సంవత్సరానికి చెందిన రెంజల్ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అట్టహాసంగా జరిగింది. జుట్టు నెరిసినా, బాధ్యతలు పెరిగినా, ఆ పాత జ్ఞాపకాలు మాత్రం వారిని మళ్లీ తమ చదువుల తల్లి ఒడికి చేర్చాయి. రెంజల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 198081 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు దాదాపు 45సంవత్సరాల తరువాత ఒకే వే దికపై కలుసుకున్నారు. ఉద్యోగ రీత్యా వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ ఒకరినొకరు గుర్తు పడుతూ, ఆలింగనం చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. నువ్వు అప్పట్లో ఇలా ఉండే వాడివి. ఇప్పుడు గుర్తు పట్టలేనంతగా మారిపోయావు అంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. క్లాస్ రూమ్ బెంచీలు, ఆట స్థలం, ఆనాటి అల్లరి పనులు గుర్తు చేసుకుంటూ అందరూ బాల్యంలోకి వెళ్లిపోయారు.



ఈ కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తమ ఎదుగుదలకు పునాది వేసిన ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమ విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉండటం గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మరణించిన తోటి మిత్రులకు, ఉపాధ్యాయులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేస్తూ గడిపారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పలువురు విద్యార్థులు హామీనిచ్చారు. వయస్సు పైబడినా, తమ స్నేహం మాత్రం ఇంకా పచ్చగానే ఉంది అంటూ పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. మళ్లీ ఇలాగే కలుసుకోవాలని ప్రతిజ్ఞ చేస్తూ, బరువెక్కిన హృదయాలతో తీపి జ్ఞాపకాలతో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.ఉపాధ్యాయులు విజయనంద రావు, నిర్మల్ ప్రసాద్, ఇన్నయ్య, లక్ష్మీ కాంత్, ప్రధానోపాధ్యాయులు మదుక్రిష్ణ, కాంటా ఆంజనేయులు, సభ్యులు అబ్బాగోని లక్ష్మీ నర్సయ్య గౌడ్, సాయిలు, హన్మగౌడ్, రవీందర్ రెడ్డి, బింగే భిక్షపతి, సుదాకర్, శ్రీనివాస్ గౌడ్, ఆంజనేయులుతో పాటు మహిళ పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన సిపిఎం బైక్ యాత్ర ..

### పెంబి అభివృద్ధి కోసం పోరుబాట



**ప్రజాపక్షం / పెంబి :** పెంబి మండల సమగ్రత అభివృద్ధిని కోరుతూ సి.పి.ఎం. నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగిన నిర్మాణ ఆధ్యాయన బైక్ యాత్ర ఆదివారం గుమ్మేనా వద్ద ముగిసింది. ఈ సందర్భంగా సి.పి.ఎం. జిల్లా కార్యదర్శి గౌతం కృష్ణ, ఇతర నాయకులు మాట్లాడుతూ, టైగర్ జోన్ పేరిట పెంబి మండలాన్ని అభివృద్ధికి దూరం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యాత్రలో భాగంగా గ్రామాల్లో పర్యటించిన నాయకులు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా దోతి, కడెం వాగులపై వంతెనల నిర్మాణం , పోడు భూములకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ళ అనుమతులు, గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా వంటి మౌళిక సదుపాయాలను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించని పక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ యాత్రలో జిల్లా నాయకులు దుర్గం నూతన కుమార్, బొమ్మెన సురేస్, తొడసం శంభు,, ఇతర మండల నాయకులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** కాంగ్రెస ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను మండలంలోని పల్లె(హరిపూర్)లో పూర్తిస్థాయిలో నిర్మించిన మూడు ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లను ఆదివారం సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్, ఉపసర్పంచ్ సుంకపక రవి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించి మాట్లాడారు. గృహప్రవేశాలు చేసుకున్న ఇళ్ల యజమానులకు శుభాకాంక్షలు తెలుపుతూ స్వంత నిధులతో సర్పంచ్ కానుకలను ఇందిరమ్మ లబ్ధిదారులకు అందజేశారు. మరో విడతలో ఇళ్లు లేని పేదవారికి కూడా ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయటం జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ మా కలను నెరవేర్చినందుకు ప్రజాపాలన ప్రభుత్వానికి సిఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురకంటి చిన్నారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి లోకె హరీష్‌రెడ్డి, వార్డు మెంబర్లు ఎల్ల శాంతి, లావణ్య, మధుమిత, మాధురి, కవిత పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమాజ హిత కార్యక్రమాలకు నూతన ఒరవడితో శ్రీకారం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తమ వంతు బాధ్యతగా సమాజంలో ప్రతి సంవత్సరం దివ్యాంగులు ఇతర సమాజహిత కార్యక్రమాలకు నూతన ఒరవడితో శ్రీకారం చుడుతూ ముందుకొస్తున్న స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి సిద్ధయ్యలు ఎంతో గొప్ప విషయమని సొసైటీ అధ్యక్షులు డాక్టర్ మహిపాల్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ సవితా రాణి కొనియాడారు. వారు చేసిన సేవలో మేము, సిబ్బంది సైతం ఒక సమిది కావటం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. వారిపై భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ దివ్యాంగ పాఠశాలలో 34వ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. సొసైటీ సేవలు మరువలేనివని, ఎన్నో రకాల సేవలందించటం జరుగుతుందన్నారు. విచ్చేసిన ప్రతిఒక్కరికి శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. సభ్యులు షేర్ల దయానంద్, తాటి వీరేశం, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.